# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు.
- ❖ పర్యావరణాన్ని పరిరక్షించి జీవవైవిధ్యాన్ని కాపాడటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.
- ❖ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అత్యంత విశేషంగా నిర్వహించే గరుడ వాహన సేవ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు తెలిపారు.
- ❖ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

==============================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ ప్రసాదాన్ని ప్రధానమంత్రికి అందజేశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారని అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే ఈరోజు సాయంత్రం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశం కానున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రహదారుల శాఖ మంత్రి నిత్ గడ్కరీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, రేపు సమావేశం కానున్నారు.

==============================

పర్యావరణాన్ని పరిరక్షించి జీవవైవిధ్యాన్ని కాపాడటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అరణ్య భవన్ లో నిర్వహించిన 70వ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సభకు ఉపముఖ్యమంత్రి ఈరోజు హాజరయ్యారు. వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా అటవీ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను పవన్ కల్యాణ్ తిలకించారు. సముద్ర తాబేళ్ల రక్షణ కోసం తయారు చేసిన మెరైన్ ఫానా

యాప్ ను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. అలాగే కింగ్ కోబ్రా సంరక్షణపై రూపొందించిన కర పత్రికను ఆవిష్కరించారు. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే ప్రజలంతా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, అది ఇంటి నుంచే ప్రారంభం కావాలని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

==============================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారికి అత్యంత విశేషంగా నిర్వహించే గరుడ వాహన సేవ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) జె.శ్యామలరావు తెలిపారు. దీనిలో భాగంగా ఈరోజు అర్థరాత్రి నుంచి కనుమ రహదారుల్లో ద్విచక్రవాహనాలను నిషేధించటంతో పాటు, కొండ కింద అలిపిరి వద్ద వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. గరుడ సేవకు అధిక సంఖ్యలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, ప్రధాన కూడళ్ల వద్ద అన్నప్రసాదం అందుబాటులో ఉంటుందని ఆయన తెలియజేశారు. భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ 400కు పైగా బస్సులు ఏర్పాటు చేసిందని టీటీడీ ఈఓ వెల్లడించారు.

==============================

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ), సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు వంటి సంస్కరణలకు ఆద్యుడైన ఎస్.ఆర్.శంకరన్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి అన్నారు. ఈరోజు ఎస్.ఆర్.శంకరన్ 14వ వర్ధంతి సందర్భంగా బాపట్ల కలెక్టర్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి అధికారులతో కలిసి నివాళులర్పించారు. మహోన్నత వ్యక్తిత్వం గల ఎస్.ఆర్.శంకరన్ అడుగుజాడలు దేశ వ్యాప్తంగా కనిపిస్తాయని కలెక్టర్ మాట్లాడుతూ…

(వాయిస్ 32 సెకన్లు)

==============================

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు లోక్‌సభ సభాపతి ఓం బిర్లాను విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వానించారు. ఈ రోజు ఆయన ఢిల్లీలో ఓం బిర్లాను కలిసి ఉత్సవాలకు ఆహ్వానంతో పాటు.. తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని కూడా ఆయనకు అందజేశారు.

==============================

ధాన్యం సేకరణ ప్రక్రియకు అధికారులు సన్నద్ధం కావాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టి. నిషాంతి అన్నారు. అమలాపురం కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాన్యం సేకరణపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఈరోజు ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ… నవంబర్ మొదటి వారంలో ధాన్యం సేకరణకు అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలో 4.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరించడానికి తేమ యంత్రాలు, బరువు తూచే వేయింగ్ బ్రిడ్జిలు, కాటా యంత్రాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విరామం

==============================

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... నూతన ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే కొండపి నియోజక వర్గంలో రహదారులు, కాలువల నిర్మాణం కోసం 17 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు "పల్లె పండుగ" కార్యక్రమం కింద మంజూరైన పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపడతామని మంత్రి తెలియజేశారు.

================================

విలు విద్యకు సంబంధించి జాతీయ స్థాయిలో పోటీపడేలా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో క్రీడా సాధికారిత సంస్థ జిల్లా అధికారి ఎస్. వెంకటేశ్వరరావు ఈరోజు కలెక్టర్ తో సమావేశమయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు మా ఆకాశవాణి పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి సి.హెచ్ శ్రీనివాసరావు అందిస్తారు...

(వాయిస్ 30 సెకన్లు)

================================

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనెల 9వ తేదీన జాబ్ మేళా జరుగనుందని జిల్లా నైపుణ్యభివృద్ధి అధికారి జి.సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి హరిశ్చంద్ర ప్రసాద్ ఈరోజు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 4 కంపెనీలు పాల్గొంటున్నాయని ఎస్.ఎస్.సి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు బొమ్మూరులోని కలెక్టరేట్ భవనంలో న్యాక్ సెంటర్ వద్ద హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

================================

క్రీడలు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి శారీరక దారుఢ్యం పెరుగుదలకు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈరోజు రాజమహేంద్రవరం ఏర్పాటు చేసిన 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ టోర్నమెంట్-2024 క్రీడా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హ్యాండ్ బాల్ అద్భుతమైన క్రీడ అని ఈ ప్రాంతంలో అంత ప్రాచుర్యంలో లేని ఈ క్రీడను రాష్ట్రస్థాయి పోటీలో అందరికీ తెలిసే విధంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాలలోని క్రీడాకారులందరూ ఈ టోర్నమెంట్ లో పాల్గొనేందుకు రావడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

================================

ప్రజలు అందజేసే అర్జీలపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ రోజు జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో కలెక్టరు విజయ క్రిష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై అర్జీలు అందజేసారు. ఈ రోజు 232 ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు వచ్చాయి.

================================

గిరిజన బాలికలను అక్రమంగా తరలించి పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఐటిడిఏ ప్రొజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన కాకరి ప్రమీల కుమార్తె మైనర్ బాలిక మోక్షిత దేవిని రాజమహేంద్రవరం తరలించి ఇంటిలో పనులు చేయిస్తున్న శెట్టి మనోహర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఐసిడిఎస్ పి.డి. ఎన్. సూర్యలక్ష్మి అందించిన వివరాల మేరకు మోక్షిత దేవి దొంతురాయి గ్రామం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోందని, 2 నెలల క్రితం మనోహర్ బాలికలను వెంట తీసుకుని వెళ్లి రాజమహేంద్రవరంలోని తన ఇంట్లో చాకిరీ చేయించడంతో బాలిక

తప్పించుకుని గోదావరి వంతెనపై నడిచి వెళ్లడం గమనించిన ఒక వ్యక్తి తీసుకుని వెళ్లి రాజమండ్రిలో పోలీసులకు అప్పగించారని అన్నారు.

===============================

===============================